# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ కుమార్ వ్యాస్
- ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 22: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంతో పాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు ఈనెల 30న జరగనున్న పోలింగ్ కోసం పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. 001-సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి పూర్తి సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సెక్టోరల్ అధికారులకు ఇప్పటివరకు 5 సార్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని చెప్పారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రీసైడింగ్, సహాయ ప్రీసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, రిసెప్షన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, ఇతర ప్రీసైడింగ్ అధికారులకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ సమీక్షలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



కాగజ్‌నగర్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలికుడు రాహుల్ మహివాల్

కాగజ్‌నగర్, నవంబర్ 22: సిర్పూర్ నియోజకవర్గ శాసన సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని ఎన్నికల సాధారణ పరశీలకుడు రాహుల్ మహివాల్ అధికారులకు సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని నజ్రుల్‌నగర్, ఈస్గం. భట్టుపల్లిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ మహివాల్ మాట్లాడుతూ, ఈ నెల 30న జరుగనున్న శాసనసభ ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, ఇతరాత్ర సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతే కాకుండా ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఓటు హక్కు కల్పించాలని వినతి

కౌటాల, నవంబర్ 22: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో స్కూల్ బస్ నడిపే డ్రైవర్‌లకు ఓటు హక్కు సౌకర్యం కల్పించాలని హెవీ డ్రైవింగ్ లైసెన్స్ యూనియన్ సభ్యులు బుధవారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 30న ఎన్నికలు ఉన్నందున తమను వివిధ ప్రాంతాలకు పంపే అవకాశం ఉందని, కావున తామ ఓటు హక్కు ఎక్కడికి వెళ్లినా అక్కడ వేసుకునే అవకాశం కల్పించాలని వారు వినతి పత్రంలో కోరారు. యూనియన్ సభ్యులు సాయినాథ్, తిరుపతి, రఫీక్, ప్రశాంత్, రాజు, నారాయణ, మహేశ్, నరేశ్, తదితరులు ఉన్నారు.

## ఓటరు స్లిప్పుల పంపిణీ

వాంకిడి,నవంబర్ 22: అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వారి పోలింగ్ కేంద్రం, బూత్‌ల వివరాలతో కూడిన ఓటరు స్లిప్‌లను ఆయా గ్రామాల్లో ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో బీఎల్వోలు సువర్ణ, విక్రుబాయి, బధవారం పంపిణీ చేశారు. ఓటరు స్లిప్‌లతో పాటు ఓటింగ్ విధానంపై సమాచారాన్ని అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# బోధనలో టీచింగ్ డైరీని ఉపయోగించాలి

- డీఈవో పార్సి అశోక్
- మోతుగూడ, అప్పపెల్లి పాఠశాలల తనిఖీ



ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్ : హాజరు పట్టికను పరిశీలిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, నవంబర్ 22: ఉపాధ్యాయులు బోధనలో వర్క్‌బుక్, టీచింగ్ డైరీని ఉపయోగించాలని డీఈవో పార్శి అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ , అప్పపెల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు .ఈ సందర్భంగా సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని పరిశీలించారు . ముఖ్యమంత్రి అల్పాహార పథకానికి సంబంధించి ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి ఇప్పటివరకు 100 శాతం హాజరు అయిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల రీడింగ్ నైపుణ్యాన్ని, ఉపాధ్యాయుల డైరీని, పాఠ్యప్రణాళికలను, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. తాను బోధిస్తున్న పాఠ్యాంశాలను అభ్యసన దీపికలతో అనుసంధానం చేసి బోధించాలని కోరారు. పాఠ్యాంశ బోధనలో వెనుకబడి ఉన్న ఉపాధ్యాయుల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోధనా తీరును పరిశీలించాలని కోరారు. ప్రతిరోజు అల్పాహార పథకం ఎఫ్ఆర్ఎస్ నమోదు కార్యక్రమం, విద్యార్థుల హాజరు ఎఫ్ఆర్ఎస్ నమోదు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు అయిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం అందించే లబ్ధి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్, కమ్యునిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ కటకం మధుకర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య , సీసీవో అనుపుకుమార్, సీఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.



వాంకిడి: ఎన్నికల నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ

# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ
- కనర్‌గాంలో ఓటు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన

వాంకిడి,నవంబర్ 22 : ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ కోరారు. బుధవారం మండలంలోని కనర్‌గాంలో ప్రజలకు ఎన్నికల, నియమాలు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని వ్యక్తిగతంగా,రాజకీయంగా విద్వేషాలనే రెచ్చగొట్టె పోస్టులు పెట్టేవారిపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వాంకిడి: మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రికార్డులను పరిశీలింస్తున్న అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్

# దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్

వాంకిడి,నవంబర్ 22: ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంద్రంలోని ప్రభుత్వ దవాఖానాను ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి,రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు వచ్చేరోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రతి నెలా గర్భిణులకు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్, ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, సిబ్బంది ఉన్నారు.

# బాలికలు, మహిళల రక్షణ కోసమే షీ టీంలు




రెబ్బెనలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

రెబ్బెన, నవంబర్ 22: బాలికలు, మహిళల రక్షణ కోసమే షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు అదేశాలతో పాఠశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైతే వెంటనే షీ టీంలను సంప్రదించాలని సూచించారు. అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 8712 670564 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయరాణి, షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత పలువురు ఉన్నారు.